

# టిక్కెట్ల కోసం ఢిల్లీలో కాంగ్రెస్ ఆశావాహుల ధర్నా

ఢిల్లీ/ ఇల్లందు అర్బన్ (ప్రభ న్యూస్) ఢిల్లీ లోని ఏఐసీసీ కార్యాలయం ముందు ఇల్లందు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ధర్నాకు దిగారు. కాంగ్రెస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గంలో నుండి పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీలో కష్టపడి జండా మోసిన నాయకులకి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని నినాదాల చేశారు. నిన్న కాక మొన్న పార్టీలో వచ్చిన కోరం కనకయ్యను టికెట్ కేటాయించవద్దు .. సేవ్ కాంగ్రెస్ .. సేవ్ ఇల్లందు.. పేరాచూట్కు హటావో.. ఇల్లందుకు బచావో .. అనే నినాదాలతో ఏఐసీసీ కార్యాలయం ముందు ఎమ్మెల్యే అభ్యర్థులు అందరూ కూడా ధర్నాకు దిగారు. ఈ కార్యక్రమం లో భూక్యా దళ్ సింగ్ నాయక్, చీమల వేంకటేశ్వర్లు,కామేపల్లి జెడ్పీటీసీ వెంకట ప్రవీణ్, నాగేంద్ర నాయక్ ,విజయ లక్ష్మి ,శంకర్ నాయక్ , లక్ష్మణ్ నాయక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాళ్లిద్దరూ లిక్కర్ కింగులే!

### వైసీపీ నేతలదే కీలకపాత్ర



**విజయవాడ:** ఏపీలోని డిస్టలరీల్లో వైసీపీ నేతల దందా నడుస్తోందని, ముఖ్యంగా ఎంపీ విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డి కనుసన్నల్లోనే దందా నడుస్తోందని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరీ ఆరోపించారు. ఏపీలో బేవరేజెస్ కార్పరేషన్లో డిస్టలరీ యజమానుల వివరాలు కోరితే ప్రభుత్వం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ బెవరెజెస్ కార్పొరేషన్ లో 100 కు పైగా డిస్టలరీ కంపెనీల నమోదు కాగ, ఇందులో 16 కంపెనీలే 74 శాతం మద్యం చేస్తున్నాయన్నారు. మద్యం సరఫరా ఆర్డర్లలో అదాన్ కంపెనీ అత్యధికంగా కైవశం తెరమీదకు వచ్చిన అదాన్ డిస్టలరీస్ చేసుకుందని రూ. 1164 కోట్ల మేర మద్యం సరఫరా చేసిందని, ఈ కంపెనీ వెనుక ఎంపీ విజయసాయి రెడ్డి ఉన్నారని ఆమె ఆరోపించారు. చింతకాయల రాజేష్ , పుట్టా మహేష్ సంస్థలను అదాన్ కంపెనీ చేజిక్కించుకుందన్నారు. ఎస్పీవై అగ్రస్ సంస్థకు రూ. 1800 కోట్ల ఆర్డర్స్ ఉన్నాయని, ఈ సంస్థ వెనుక మిథున్ రెడ్డి ఉన్నారని పురంధరేశ్వరి ఆరోపించారు. ప్రకాశం జిల్లాలో పెర్ల్ డిస్టలరీస్ ను సీఎం జగన్ సన్నిహితులు బలవంతం పెట్టి సబ్ లీజుకు తీసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసే కంపెనీల జాబితా.. ఆ కంపెనీల ఓనర్ల జాబితా ఇవ్వాలంటే ఇవ్వలేదని, ఇప్పుడు మేమే ఆ వివరాలు బయట పెట్టామన్నారు. మద్య నిషేధం అమలు చేయబోమని చెప్పి మరీ మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారన్నారు మద్యం దుకాణాల్లో . ఫోన్ పే.. గూగుల్ పే ఎందుకు కన్పించవని పురంధరేశ్వరి ప్రశ్నించారు.

- హస్తిన ఓకే అనడంతో బ్రదర్స్ రాజకీయాలు
- మునుగోడు నుంచే కోవర్ట్ ఆపరేషన్
- రెచ్చగొట్టి తుస్సుమన్న నేతలు
- మండిపడుతున్న బీజేపీ శ్రేణులు

# హస్త వికాస.. కుట్ర!



## రక్తికట్టిస్తున్న రాజగోపాల్ ఎపిసోడ్

### బీజేపీని మట్టికరిపించే వ్యూహం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ**

మునుగోడు ముందు వరకూ కాషాయ జెండా రెపరెపలాడిం ది! దుబ్బాక, హుజూరాబాద్ ఎన్నికల్లో విజయ ఢంకా మోగించింది. ఆ తర్వాత జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో భారాసతో నువ్వా? నేనా? అన్నట్టుగా విజయ ప్రస్థానం సాగింది. ఆయా ఎన్నికల్లో కాంగ్రెస్ డిపాజిట్లను కూడా దక్కించుకోలేని పరిస్థితి! భారాసకు తానే ప్రత్యామ్నాయంగా ఎదిగి సవాల్ విసిరిన కమలదళం మునుగోడు ముందు నుంచి కోవర్ట్ కుట్రలను అంచనా వేయ లేక చతికిలపడడం మొదలైందన్న విశ్లేషణలు సాగుతున్నాయి. ఒక ప్రణాళిక ప్రకారం భాజపా ను దెబ్బతీస్తూ వచ్చారని విశ్లేషకులు స్పష్టం చేస్తు న్నారు. ప్రస్తుతం ఎన్నికల వేళ రాజగోపాల్ రెడ్డి అస్త్ర సన్యాసం ఎందుకు చేసినట్టు? సమాధానం కోసం చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఆయన మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే పదవికి రాజీ నామా చేయడమే పెద్ద డ్రామాగా ఇప్పుడు పరిశీ లకులు అనుమానిస్తున్నారు.

భాజపాలోకి అట్ట హాసంగా చేరిన ఆయన ఉప ఎన్నికలో అక్కడి నుంచే పోటీలోకి దిగి కాంగ్రెస్‌పై తొడ చరిచారు. అప్పటి నుంచి కాంగ్రెస్ నుంచి భాజపాలోకి వల సలు కూడా భారీగానే సాగాయి. అయితే, ఉప ఎన్నికలో ఆయన ఓడిపోయారు. దీనివెనుక కూడా అంతు చిక్కని ఎత్తుగడ ఉందని భాజపా వ్యూహకర్తల్లోనూ అనుమానాలు ఉన్నాయని అంటున్నారు. కావాలనే ఎమ్మెల్యే పదవికి రాజీ నామా చేసి భాజపా అధిష్టానాన్ని నమ్మించా రన్నది ఇప్పుడు ప్రధాన ఆరోపణ!

మునుగోడు ఉప ఎన్నిక నుంచి ఆ తర్వాత వరుసగా పలు తప్పిదాలు జరిగాయని విశ్లేషిస్తు న్నారు. చివరకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను మార్చే వరకూ ఇది సాగి చివరకు రేసులో బాగా వెనుకబడిపోయిందని చెబుతు న్నారు. మరో నెల రోజుల్లో ఎన్నికలు జరుగనుం డగా, కీలక నేతలు ఇప్పుడు కాడి పారేయడం వెనుక కారణాలు ఇవేనని డీలా పడిపోయిన శ్రేణులే అంటున్నాయి. కాంగ్రెస్‌పై విరుచుకుపడి రెచ్చగొట్టిన నేతలంతా ఇప్పుడు గాలితీసిన బెలూన్‌ల వలె మారిపోవడమేమిటని వారు ఆగ్రహావేశాలతో ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో భారాస అంతుచూస్తామని ప్రగల్భాలు పలికిన నేతలంతా ఇప్పుడు తోక ముడిచి పార్టీని భ్రష్టుపట్టించారని కార్యకర్తలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. రాజకీయాల్లో గెలుపోటములు ఎలా ఉన్నా, మునుగోడులో ఒడిన తర్వాతి నుంచి రాజగోపాల్ ప్రవర్తన వివాదాస్పదంగా మారిందని వారి వాదన. పార్టీలోకి ఎందుకొచ్చానా అన్నట్టు ఆయన వ్యవహరిస్తున్నారని, కీలక సమావేశాలకు డుమ్మా కొట్టారని వారు గుర్తు చేస్తున్నారు. ఇదంతా కాంగ్రెస్ అధిష్టానం అనుమతితో కోమటిరెడ్డి బ్రదర్స్ వ్యూహమేనని ఘంటాపథంగా చెబుతున్నారు. ఇందుకు వారు చూపుతున్న కారణం కూడా అందుకు దోహదపడుతోంది. ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కాంగ్రెస్, రేవంత్, ఇతర నేతలపై పలు ఆరోపణలు చేసినా, పార్టీ కార్యక్రమాలకు అప్పట్లో దూరంగా ఉన్నా, మునుగోడు ఎన్నికల్లో రాజగోపాల్ రెడ్డికి ఓట్లేయాలని చెబుతూ అడ్డగోలుగా దొరికిపోయినా ఆయనపై ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. పైగా... నాపై క్రమశిక్షణ చర్యలు తీసుకోమని ఇచ్చిన ఫిర్యాదులు ఎప్పుడో బుట్టదాఖలయ్యాయని ఆయనే స్వయంగా చెప్పడాన్ని కూడా వారు గుర్తు చేస్తున్నారు. ఇదిలావుంటే... మొత్తం ఎపిసోడ్‌లో కేవలం రాజగోపాల్ రెడ్డి ఒక్కరేనా? ఇంకా మరికొంతమంది నేతలు ఉన్నారా అన్నది ఇప్పుడు భాజపా అధిష్టానాన్ని తొలుస్తోంది. అందుకే కొందరు కీలక నేతలకు మొదటిలిస్ట్‌లో సీట్లు కేటాయించలేదన్న ప్రచారం ఇప్పుడు ప్రబలంగా వినిపిస్తోంది! మరి వీరంతా కట్టకట్టుకుని కాంగ్రెస్‌లోకి దూకి కోవర్టలన్న ఆరోణలను నిజం చేస్తారా? లేక గమ్మున ఉండిపోయి భాజపాలో నామ్‌కే వాస్తే నేతల్లా మిగిలిపోతారా? అన్నది మరో వారంలో తేలిపోతుందంటున్నారు.

# గురితప్పిన బాణం!

## స్పష్టతలేని గమ్యం.. అపరిపక్వ విధానం


- షర్మిల అవగాహనలేమి
- రాజకీయ ఆటలో బలి
- కుటుంబ ప్రతిష్టకూ దెబ్బ
- విజయమ్మను బరిలోకి లాగడమేంటని ప్రశ్నలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** అవగాహన లేమితో, స్థిరత్వం లేని నిర్ణయాలతో షర్మిల ఏ వర్గాన్నీ సంతృప్తి పరచలేకపోయారు. పైగా పోను పోను ఏవగింపుగా మారాయన్న విమర్శలు కూడా వచ్చాయి. ఆమె భాజపా వదిలిన బాణమని, జగనన్న వదిలిన బాణమని, కాదు..కాదు.. కాంగ్రెస్ వదిలిన బాణమని విమర్శలు, విశ్లేషణలు సాగాయి. తానెవరు వదిలిన బాణాన్ని కాదని ఆమె పదేపదే చెప్పుకోవాల్సి రావడంతో ప్రతిష్ట అడుగంటింది. పైగా కాంగ్రెస్‌తో విలీనమని, పొత్తు అని రకరకాలుగా సాగిన ప్రచారం ఆమెను మరింత దెబ్బతీశాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంతో కర్నాటకకు చెందిన కాంగ్రెస్ నేత డీకే శివకుమార్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కాంగ్రెస్‌లో విలీనానికి కాని, పొత్తుకు కాని తాను సిద్ధమని ఆమె రాయబారాలు నడిపారు. చివరకు హస్తిన వెళ్లి సోనియా, రాహుల్, ప్రియాంకలను కలిశారు. కాని, ఏమీ తేల్చలేకపోయారు. దీంతో ఆమె ఏకాకిగా మిగిలిపోయారు. సరైన హామీ లేకుండా పిలిచారు కదా అని ఆదరాబాదరాగా హస్తిన పరుగెత్తడమేమిటని, తీరా కలిసి చర్చలు ముగిసిన తర్వాత ఏమీ తేలకుండానే కాంగ్రెస్‌కు,



సోనియా, రాహుల్‌లకు ఎందుకు సర్టిఫికెట్ ఇచ్చారని సొంత కేడరే విమర్శిస్తోంది!

ఇంత జరిగినా ఇంకా ఆమె తనతో పాటు కుటుంబ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్నారన్న విమర్శలు ప్రస్తుతం వినిపిస్తున్నాయి. ఎన్నికల బరిలోకి తల్లి విజయమ్మను కూడా లాగడం అత్యధిక వైఎస్సార్ అభిమానులకు నచ్చలేదు. ఆమెను ఎన్నికల రొచ్చులోకి లాగడం ద్వారా ఒనగూరే లాభం కంటే కుటుంబానికి, సోదరుడు జగన్మోహన్‌రెడ్డికి మరింత నష్టం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధాత్మిక బాటలో ఉన్న విజయమ్మను బరిలో దించి క్రైస్తవుల ఓట్లను పొందాలన్న దురాలోచన తప్ప ఇందులో ఎటువంటి రాజకీయ ప్రయోజనం లేదని వారు విమర్శిస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డికి తెలంగాణ సమాజంలో ఉన్న గౌరవాన్ని కూడా షర్మిల మంటగలిపే చర్యలను వారు నిరసిస్తున్నారు. రాజకీయాలంటే కేవలం సభలు, సమావేశాలు, పాదయాత్రలు కాదు. ఎమోషనల్‌గా ఆవేశ ప్రసంగాలు చేస్తే జనం వినే రోజులు పోయాయి... ప్రజలకు ఏం చేయగలం, ఏవిధంగా చేయగలమో చెప్పడం, ప్రత్యర్థుల కంటే ముందస్తు వ్యూహాలు పన్ని తదనుగుణంగా ప్రణాళికలతో ముందుకు సాగడమని ఆమె గుర్తించలేకపోయారన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. రాజకీయాల్లో తరతమ బేధాలు ఉండవన్న సంగతి ఆమెకు ఇప్పటికి గాని తెలిసివచ్చి ఉండదు. డీకే శివకుమార్ ఎంత కుటుంబ సన్నిహితుడైనా తన రాజకీయ భవిష్యత్తును ఇతరులకు పణంగా పెట్టలేరు కదా! తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు అభ్యంతరంతోనే వైతెపా విలీనం లేదా పొత్తు ఆగిపోయిందన్నది నగ్న సత్యం. షర్మిలతో పొత్తు పెట్టుకుంటే గత ఎన్నికల్లో చంద్రబాబు బూచి చూపి కేసీఆర్ ఏవిధంగా కాంగ్రెస్‌ను దెబ్బకొట్టారో తెలియజెప్పడం ద్వారా రేవంత్ అధిష్టానానికి కళ్లెం వేయగలిగారని విశ్లేషకులు చెబుతున్నారు. పైగా సొంత రాష్ట్రంలో రాజకీయం చేయకుండా తెలంగాణకు వచ్చి చేయడం ఏమిటని ఎదురు ప్రశ్నించడంతో అధిష్టానం వెనక్కితగ్గింది. వాస్తవాలను తెలుసుకోకుండా రాజకీయ అపరిపక్వతతో పార్టీ స్థాపించి అధికారం కోసం పాదయాత్రలు చేసినా విఫలమవడం ఖాయమని వైతెపా అధ్యక్షురాలు షర్మిల ఉదంతం రాజకీయ చరిత్రలో ఒక పాఠంగా నిలిచిపోతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.




# ఢిల్లీలో పవన్ మంతనాలు

## పొత్తులపై బీజేపీ అగ్రనేతలతో భేటీ - అమిత్ షా, నడ్డాతో చర్చించనున్న జనసేనాని

న్యూఢిల్లీ తెలంగాణ ఎన్నికలు దగ్గరపడుతుంటంతో భారతీయ జనతాపార్టీ స్పీడు పెంచింది. జనసేనతో పొత్తు విషయంపై తేల్చేందుకు బీజేపీ సిద్ధమైంది. అయితే, ఎవరికెన్ని సీట్లు అనేది తెలియాల్సి ఉందని ఇరుపార్టీల్లో టాక్ వినిపిస్తోంది. అయితే, జనసేన, బీజేపీ పొత్తుకు తుది రూపు ఇచ్చేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలవనున్నారు. ఈ భేటీ కోసం ఆయన ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరారు. పవన్ వెంట తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కూడా ఉన్నారు. పొత్తులో భాగంగా ఏపీతో సరిహద్దు ఉన్న నియోజకవర్గాలను జనసేనకు కేటాయించే ఆలోచనలో బీజేపీ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ భేటిలో జనసేన నేతలు పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ పాల్గొననున్నారు. బీజేపీతో పొత్తుకు జనసేన సిద్ధమైందని.. అయితే సీట్ల విషయంపై చర్చించనున్నట్లు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయని లక్ష్మణ్ అన్నారు. ఈ విషయంలో రెండు పార్టీలు ఒక నిర్ణయానికి వచ్చాయని తెలిపారు. ఎన్ని సీట్లు అన్నది త్వరలోనే నిర్ణయిస్తామని లక్ష్మణ్ ప్రకటించారు.

